సాక్షి
అనంతపురం

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.31,190
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,190 వేలు క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.33
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టం రూ.13, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.8°/21.2°
జిల్లా అంతటా గురువారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. చలితీవ్రత తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

రసాయన మందుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: రైతులు పంటల సాగులో రసాయన మందులు తగ్గించుకుని సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంతో పాటు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన మందుల వాడకంతో భూమి కలుషితమవుతోందన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని, ఫలితాల మేరకు ఎరువులు వాడాలన్నారు. అంతకుముందు డీఏఓ గార్లదిన్నె మండలం కల్లూరులో వరి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రబీ 'ఈ-క్రాప్' ప్రారంభం

అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించి ఈ-క్రాప్ ప్రక్రియ ప్రారంభించినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన, మల్బరీకి సంబంధించి పంట వివరాలు, రైతు బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని సూచించారు. పంట సాగుదారుడిని గుర్తించి జియో కో ఆర్డినేటర్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట విస్తీర్ణం, పంట రకాలు, ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన డ్రిప్, స్ప్రింక్లర్ల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. జనవరి 25వ తేదీ లోపు ఈ- పంట, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వతేదీ వరకు సామాజిక తనిఖీలో భాగంగా ఆర్ఎస్‌కేలో జాబితాలు ప్రదర్శించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, 10వ తేదీలోపు సరిచేయాలన్నారు. ఫిబ్రవరి 15న తుది ముసాయిదా ప్రభుత్వానికి పంపుతామన్నారు.

'ఐది'ంతల ఆనందం



ఐదు పిల్లలను ఈనిన మేక

కుందుర్పి: మండలంలోని శ్రీమజ్జనపల్లి గ్రామవాసి హనుమంతరాయుడికి చెందిన మేక గురువారం ఐదు పిల్లలను ఈనింది. మొదటి ఈతలో 3 పిల్లలు, రెండో ఈతలో 4, మూడో ఈతలో 5 పిల్లలను ఈనిందటూ హనుమంతరాయుడు ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై వెటర్నరీ వైద్యులు ప్రసాద్ మాట్లాడుతూ జన్యుపరంగా మేకలు 3 నుంచి 6 పిల్లల వరకు జన్మనిస్తాయని తెలిపారు.

జాడ లేని ఎంఎస్‌ఎంఈలు
- గత ప్రభుత్వ హయాంలో వేలాదిగా ఏర్పాటు
- భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన
- కూటమి సర్కారులో పెట్టుబడులకు ఔత్సాహికుల వెనుకడుగు
- టీడీపీ నేతల వసూళ్ల బెదిరింపులతో దుస్థితి
- ఉన్న పరిశ్రమల్లోనూ ఉద్యోగుల తొలగింపు
- ఈ ఏడాది ఇప్పటివరకూ 71 యూనిట్లకే అనుమతులు



ప్రభవించని పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు హయాంలో నిరుద్యోగులకు ఉపాధి గగనమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. 2019-24 వరకూ పరిశ్రమల ఏర్పాటులో కొత్త ఒరవడి ఉండేది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశ్రమల ఏర్పాటుకు ఒక్కరంటే ఒక్కరైనా ముందుకు రాని దుస్థితి. ఏ నియోజకవర్గంలోనూ పెట్టుబడులకు అనుకూలంగా లేని పరిస్థితులు నెలకొన్నట్టు నిపుణులు చెబుతున్నారు. 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబు మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని జనం వాపోతున్నారు. చివరకు గాలిమరల కంపెనీల్లో పనిచేసే వాచ్‌మెన్ ఉద్యోగాలను కూడా తొలగించారని చెబుతున్నారు.

బెదిరింపులతో బెంబేలు..

ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిస్థితులు పరిశ్రమలకు ఏమాత్రం అనుకూలంగా లేవనేది స్పష్టమవుతోంది. వాస్తవానికి బెంగుళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశం ఉంది. కానీ నియోజకవర్గంలో పరిశ్రమలు పెట్టాలన్నా, వెంచర్లు వెయ్యాలన్నా, విల్లాలు కట్టాలన్నా, చివరకు భూములు కొనుగోలు చేయాలన్నా కప్పం కట్టాల్సి వస్తోంది. చిన్న ఇళ్లు కట్టుకుంటున్నా టీడీపీ నేతలు సైట్లకు వెళ్లి పనులను ఆపేస్తున్న పరిస్థితి. దీంతో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు భూములు కొనేందుకు ఔత్సాహికులు భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన యూనిట్లనే ఇప్పుడు కొనసాగించడం (క్యారీ ఫార్వర్డ్) చేస్తున్నారు.

ఉద్యోగాలు ఎక్కడా లేవు..

ఉమ్మడి జిల్లాలో డిగ్రీలు, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వేలాదిమంది యువత ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారు. బాబు వస్తే 20 లక్షల ఉద్యోగాలొస్తాయని నమ్మి ఓట్లేసిన పాపానికి ఇప్పుడు ఉన్న చిన్న చిన్న ఉద్యోగాలూ ఊడిపోతున్నాయని, ఇదివరకే చేస్తున్న ఉద్యోగాలను కూటమి నేతలు బెదిరించి తొలగించేస్తున్నారని ఉరవకొండకు చెందిన ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పరిశ్రమలు లేదా పెద్ద పరిశ్రమల్లో ఎక్కడా ఒక్క ఉద్యోగం లేదంటూ యువకులు నిట్టూరుస్తున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ ఎంఎస్‌ఎంఈల పరిస్థితి ఇలా	
వచ్చిన పరిశ్రమలు	71
బ్యాంకుల రుణాలు	రూ.2.01 కోట్లు
బ్యాంకులకు పంపిన దరఖాస్తులు	296
లోనుకు అర్హత సాధించినవి	134
కేవీఐసీ నుంచి మార్జిన్ మనీ వచ్చింది	39
ఆర్థిక సాయం అనుమతులు ఇచ్చింది	రూ.2.23 కోట్లు

గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటు ఇలా	
ఎంఎస్‌ఎంఈలు	43,491
పెట్టుబడులు	రూ.1996 కోట్లు
ఉద్యోగాల కల్పన	1,62,135

ఎంబీఏ చేసినా ఉద్యోగం రాలేదు
నేను ఎంబీఏ పూర్తి చేశాను. జిల్లాకు కొత్తగా పరిశ్రమలు రాకపోవడంతో నాలాంటి వారికి ఉద్యోగావకాశాలు దక్కడం లేదు. మాకున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నా పెద్దగా రాబడి లేదు. ఉద్యోగమూ లేక వ్యవసాయంలో లాభాలూ రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–కె.పరంధామరెడ్డి, చిన్మయనగర్

నిరుద్యోగిగానే ఉన్నా
పరిశ్రమలొస్తే ఏదో చిన్న ఉద్యోగం దొరికేది. కానీ కొన్ని నెలలుగా పరిశ్రమలే ఏర్పాటు కావడం లేదు. డిగ్రీ పూర్తిచేసినా ఉద్యోగం లేక ఇంటివద్దే ఉన్నాను. ఏదైనా చిన్న ఉద్యోగం వచ్చినా కుటుంబం ఒడ్డున పడుతుందని ఆశతో ఉన్నాను. పరిశ్రమలొచ్చే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

–నరసింహారెడ్డి, ప్రసన్నాయపల్లి

పుత్తడి బొమ్మకు పెళ్లి



అనంతపురం సిటీ: అనంతపురానికి కూతవేటు దూరంలో జరిగిన బాల్య వివాహం నివ్వెరపరుస్తోంది. రెండు కిడ్నీలు పాడై మూడు పదుల వయస్సు దాటిన ఓ గొర్రెల కాపరికి బాలికతో పెళ్లి జరిపించడం సంచలనంగా మారింది. వివరాలు.. శింగనమల మండలానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం అనంతపురానికి కూతవేటు దూరంలోని గ్రామానికి వచ్చి స్థిరపడింది. తమ కుమార్తెను అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు చేర్పించారు. బాలిక ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన గొర్రెలు కాసే 31 ఏళ్ల యువకుడితో ఇటీవల బాలికకు పెళ్లి నిశ్చయించారు. రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి తమ కుమార్తెను కట్టబెట్టేందుకు తల్లిదండ్రులు సిద్ధం కాగా, ఈ విషయం ఐసీడీఎస్, చైల్డ్ లైన్, కార్మిక, మహిళా పోలీస్ అధికారులకు తెలిసింది. దీంతో వారు గత నెల 24న బాలిక కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే ఆ తరువాత మరోసారి వారు పెళ్లి ప్రయత్నాలు చేయగా, అధికారులు మళ్లీ ఈ నెల 3న రెండు కుటుంబాలను గట్టిగా హెచ్చరించారు.

మరుసటి రోజే వివాహం..

అధికారుల హెచ్చరికలను పెడచెవిన పెట్టిన బాలిక తల్లిదండ్రులు మరుసటిరోజు అంటే ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున రాప్తాడు సమీప గ్రామంలోని శివాలయంలో పెళ్లి జరిపించారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు రాప్తాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఐ శ్రీహర్ష కేసు నమోదు చేశారు. యువకుడితో పాటు అతని తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- జేసీ శివ్ నారాయణ్ శర్మ



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ, చిత్రంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పేనాయక్, ఆర్‌డీఓలు

అనంతపురం అర్బన్: భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. సదస్సులకు సహకరించాలని ప్రజా సంఘాల నాయకులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పేనాయక్, ఆర్‌డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్‌తో కలిసి అధికారులు, ప్రజా సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లాలోని 504 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్‌డీఓలు, ఇతర అధికారులు పనిచేయాలన్నారు. సదస్సుల్లో హౌసింగ్, పంచాయతీ, విద్య, సర్వే, ఎస్పీడీసీఎల్, రిజిస్ట్రేషన్, పౌర సరఫరాలు తదితర శాఖల అధికారులు పాల్గొనాలని చెప్పారు. సదస్సుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామస్థాయిలో భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శిరీష, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సఫాయి చట్టం పకడ్బందీగా అమలవ్వాలి

సఫాయి కర్మచారీ చట్టం పకడ్బందీగా అమలు చేసి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ (మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం–2013) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు గైర్హాజరయ్యే కార్మికులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎవరైనా సఫాయి కర్మచారీలు ఉంటే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, భద్రత సామగ్రి తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. సఫాయి కర్మచారీల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రుణాలు ఇప్పించాలని చెప్పారు. కార్మికుల సమస్యలను సమావేశం దృష్టికి కమిటీ సభ్యులు పెన్నోబులేసు, వినోద్‌కుమార్, నర్సింహమ్మ తీసుకొచ్చారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, నగర పాలక కమిషనర్ నాగరాజు, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల బాధ్యత యాజమాన్యాలదే

- డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయండి
- కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

అనంతపురం అర్బన్: 'కార్మికులకు భద్రత కల్పించడం యాజమాన్యాల బాధ్యత. ఈ విషయంలో రాజీ పడకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి' అని కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తన పేరుతో ఎవరైనా యాజమాన్యాలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే ఉన్నతాధికారులకు, మంత్రి పేషీకి ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లాకు విచ్చేసిన ఆయన గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. స్థానిక యువత అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామన్నారు. పరిశ్రమల నిర్వాహకులకు ఎలాంటి భయాందోళనలు లేకుండా పని చేసుకునే వాతావరణం కల్పిస్తామన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు చట్టాల ద్వారా సంక్రమించే ప్రయోజనాలను కల్పించాలన్నారు. కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుదామిశ్రా ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు బాధిత కార్మిక కుటుంబాలకు తక్షణ సహాయం అందించేలా కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ తిప్పేనాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, లేబర్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య, ఇతర అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



అనంతపురంలోని గంగ-గౌరీ కాంప్లెక్స్ వద్ద ప్రేక్షకుల కోలాహలం



పుష్ప.. పాలికేక

జిల్లా అంతటా పుష్ప-2 మేనియా నెలకొంది. అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప-1 సంచలన విజయం నమోదు చేయడంతో పార్ట్- 2పై అభిమానుల్లో అంచనాలు పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే సినిమా విడుదల కావడంతో థియేటర్లకు పోటెత్తారు. బుధవారం రాత్రి సినిమా బెనిఫిట్ షో నుంచే సందడి చేశారు. ఫ్లెక్సీలను, కటౌట్లను ఏర్పాటు చేసి, బాణసంచా కాలుస్తూ ఆనందోత్సాహాల్లో మునిగితేలారు.

– అనంతపురం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



చిన్నారులతో కలిసి పుష్ప-2 సినిమాను వీక్షిస్తున్న దృశ్యం



థియేటర్‌లో అభిమానుల సందడి

విష జ్వరాలకు చిన్నారుల బలి



మృతులు దీవన్, మేఘన

డీ హీరేహాళ్(రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలం మడేనహళ్లిలో విష జ్వరాలు విజృంభించాయి. ఇద్దరు చిన్నారులను బలిగొన్నాయి. గురువారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మృతుల బంధువులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన గంగన్న, లక్ష్మి దంపతుల కుమారుడు జీ దీవన్ (4) కొన్నిరోజుల నుంచి విష జ్వరంతో బాధపడుతూ బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స ఫలించక మృత్యుఒడికి చేరాడు. తన కుమారుడు డెంగీ జ్వరంతోనే మృతి చెందాడని బాధిత తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని బొమ్మయ్య, మూకమ్మ కుమార్తె మేఘన (7) మూడు రోజుల క్రితం పాఠశాల గేటుమీద నుంచి కింద పడింది. చికిత్స కోసం బళ్లారిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి విషమించింది. జ్వర తీవ్రత తట్టుకోలేక చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు వాపోయారు. ఇద్దరూ దాయాదుల పిల్లలు కావడంతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. దేవుడా ఎంత పనిచేశావ్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

లోకో డీజిల్‌షెడ్ @61



గుత్తి: గుత్తి లోకో డీజిల్‌షెడ్ గురువారం నాటికి 61 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడి కార్మికులు శ్రమకు, అకుంఠిత దీక్షకు పెట్టింది పేరు. దక్షిణ మధ్య రైల్వేలోనే గుత్తి డీజిల్‌షెడ్‌కు ఎంతో గుర్తింపు ఉంది. కొత్త లోకోలు మొదట గుత్తి డీజిల్‌షెడ్‌కు వస్తాయి. ప్రస్తుతం రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 61 వసంతాల వేడుకలు నిర్వహించలేదు. ఈనెల 20న వేడుకలను నిర్వహించడానికి రైల్వే అధికారులు, కార్మికులు సన్నాహాలు చేస్తున్నారు.

30 వరకు జీవాలకు టీకాలు

- ఉమ్మడి జిల్లాలో 52.30 లక్షల టీకాల లక్ష్యం



అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి సోకకుండా ముందస్తుగా ఈనెల 30వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ రామచంద్ర తెలిపారు. అనంతపురం జిల్లా పరిధిలో 24.39 లక్షలు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 27.91 లక్షలు మొత్తం 52.30 లక్షల సంఖ్యలో గొర్రెలు, మేకలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జ్వరం, నోటిలో పుండ్లు, నిమోనియా, అబార్షన్, రక్త విరేచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తే పీపీఆర్ వ్యాధిగా గుర్తించాలన్నారు. వ్యాధి సోకిన జీవాలకు నివారణ చర్యలు చేపట్టకపోతే చాలా వరకు మరణాలు సంభవిస్తాయని తెలిపారు. జీవాల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున పీపీఆర్ వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. పుట్టిన పిల్లల నుంచి మందలో కొత్తగా చేరిన అన్ని జీవాలకు ఈనెల 30 లోపు పశుశాఖ అధికారులు, పారాస్టాఫ్‌ను సంప్రదించి టీకాలు వేయించుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఏఆర్ డీఎస్పీగా నీలకంఠేశ్వర్ రెడ్డి



ఎస్పీ జగదీష్‌ను కలిసిన ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి

అనంతపురం: ఏఆర్ డీఎస్పీగా నీలకంఠేశ్వర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లాకు చెందిన ఆయన 1996లో పోలీసుశాఖలో ఆర్ఎస్ఐగా తిరుపతి, చిత్తూరు, అనంతపురం పీటీసీల్లో పనిచేశారు. అనంతరం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది మహబూబ్ నగర్, అనంతపురం పీటీసీ, చిత్తూరులో విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది జూలైలో ఏఆర్ డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం విజయవాడ పోలీస్ అకాడమీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి అనంతపురం ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

టేస్టింగ్ సాల్ట్ వాడితే చర్యలు



ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్

అనంతపురం కార్పొరేషన్: ఫాస్ట్ ఫుడ్ తయారీల్లో టేస్టింగ్ సాల్ట్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం వ్యాపారులను హెచ్చరించారు. గురువారం నగరంలోని ఆర్‌సీవీ, వెంకటేశ్వర ఫాస్ట్ ఫుడ్, లక్ష్మి ఓళిగ సెంటర్, రామ్‌దేవ్ హర్యానా సమోసా, జిలేబీ సెంటర్లను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సురక్షిత ప్రమాణాలు పాటించడం లేదని సంబంధిత వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అనారోగ్యానికి ఇబ్బంది కల్గించే వాటిని తినుబండారాల తయారీలో వినియోగించకూడదన్నారు. గోబీ, చికెన్ కబాబ్ తయారీలో సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను వాడొద్దన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇచ్చే లైసెన్స్‌ను తప్పక తీసుకోవాలని సూచించారు.

ఫిట్‌నెస్ ఫిట్టింగ్

- ఆర్టీఏ ఫిట్‌నెస్ నిర్వహణపై సందిగ్ధం
- మళ్లీ ఏజెన్సీ చేతుల్లోకంటూ ఊహాగానాలు
- ఎటూ తేల్చలేకపోతున్న ప్రభుత్వం
- అయోమయంలో వాహనదారులు

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో కీలకమైన వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ ప్రక్రియ నిర్వహించడంపై ప్రభుత్వం మల్లాగుల్లాలు పడుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎఫ్‌సీ టెస్టింగ్ ప్రక్రియకు టెండర్లు నిర్వహించడంతో పాటు పలు ఏజెన్సీలకు అప్పగించారు. గత నవంబర్ 1 నుంచి ప్రసన్నాయపల్లి సమీపంలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసేందుకు యత్నించింది. అందులో భాగంగా మళ్లీ ఆర్టీఏ అధికారులకే అప్పగించారు. దీంతో కొద్దిరోజులుగా ఆర్టీఏ అధికారుల సమక్షంలోనే వాహన ఫిట్‌నెస్ ప్రక్రియ జరుగుతోంది.

ఉన్నత స్థాయిలో మంత్రాంగం

వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ ప్రక్రియ ప్రైవేటుకు ఇవ్వాలా వద్దా అన్న అంశం రాష్ట్ర స్థాయిలో మంత్రాంగం నడుస్తున్నట్లు తెలుస్తోంది. రవాణాశాఖకు వచ్చే ఆదాయంలో 50 శాతం ఎఫ్‌సీల ద్వారానే వస్తోంది. దీనికి తోడు పై అదాయం కూడా వచ్చే అంశం కావడంతో దీనిపై కన్ను పడింది. వాస్తవానికి పారదర్శకంగా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేయాలనే ఉద్దేశంతో గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. రూ.కోట్ల విలువైన సామగ్రిని కూడా సదురు ఏజెన్సీలు తెచ్చుకున్నాయి. టెండరు ద్వారా దక్కించుకొని పనులు మొదలుపెట్టాయి. కానీ రాష్ట్రంలో ముఖ్య ప్రజాప్రతినిధి నిర్ణయంతో తిరిగి అధికారుల చేతిలోకి వచ్చింది. అయితే అది కొద్దిరోజులు మాత్రమే అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సదరు ఏజెన్సీ నిర్వాహకులు కోర్టును ఆశ్రయిస్తుండడంతో ప్రభుత్వం దిగిరాక తప్పడం లేదనే వాదనలు ఉన్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట పడేదెట్టా..?

వాహనాలకు ఫిట్‌నెస్ టెస్ట్‌ల జారీలో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయడం అన్నది పెద్ద ప్రశ్నార్థకంగా మారుతోంది. ఆర్టీఏలో ఏజెంట్ల ముసుగులో దందా జరుగుతోందని, దీన్ని అడ్డుకోవాలని ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అయితే కొదిరోజులకే అక్కడ కొత్త దందాకు తెర లేపారు. అన్నీ సక్రమంగా ఉన్నా డబ్బు ముట్టజెప్పితేనే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఫిర్యాదులొచ్చాయి. అయితే ఏజెన్సీపై పర్యవేక్షణ బాధ్యతలు లేకపోవడంతో అధికారులు తమకు సంబంధం లేదనట్లు ఉన్నారు. అయితే కొద్దిరోజులు అక్కడ ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది. రవాణాశాఖలో తీవ్ర ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. కానీ ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చిన సమయంలో వారు ఎంత అడిగితే అంత ఇవ్వాల్సి వస్తోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆర్టీఏలో ఫిట్‌నెస్ పరీక్ష కోసం వచ్చిన వాహనాలు

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం



ఫిట్‌నెస్ టెస్టింగ్(ఎఫ్‌సీ) ప్రక్రియపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గతంలో ఏజెన్సీకి అప్పగించారు. అయితే ఆర్థికశాఖలో కొన్ని సమస్యలు ఉన్నందున తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీంతో ప్రస్తుతం ఆర్టీఏలోనే టెస్టింగ్ ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఏ ఉత్తర్వులు వచ్చినా అమలు చేయడానికి సిద్ధం ఉన్నాం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఈనెల 8న ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3,665 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని తెలిపారు. సంబంధిత పాఠశాల హెచ్ఎంలు పాఠశాల యూడైస్ కోడ్ ద్వారా లాగిన్ అయి వారివారి విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇంకా 251 మంది విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేయలేదన్నారు. హెచ్ఎంలు చొరవ తీసుకుని ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్ అందజేసి పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గోరంట్ల: స్థానిక మార్కెట్ రోడ్డులో గురువారం ఉదయం గుర్తు తెలియని వృద్ధురాలు షాపింగ్ కాంప్లెక్స్ మెట్లకున్న ఇనుప గ్రిల్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలికి 60 ఏళ్ల వయసుండొచ్చని పోలీసులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని పెనుకొండలోని మార్చురీకి తరలించారు.

ఉద్యాన పథకాలు వేగవంతం చేయండి

- ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన పథకాలు అమలు వేగవంతం చేయాలని ఆ శాఖ డీడీ బీఎంవీ నరసింహారావు సిబ్బంది ఆదేశించారు. గురువారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో హార్టికల్చర్ ఆఫీసర్స్(హెచ్ఓ)తో సమీక్ష నిర్వహించారు. ఐఎంఏడీహెచ్, ఆర్‌కేవీవై, వెదురుసాగు, ఆయిల్‌పాం కింద పండ్లతోటల రైతులకు ఉపయోగపడే అన్ని రకాల పథకాలు అందుబాటులో ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 40 శాతం రాయితీతో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూంల ఏర్పాటుకు రూ.15 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు స్పెషల్‌ప్యాకేజీ వర్తిస్తుందని తెలిపారు. మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్, అంజూర తదితర పండ్లతోటల సాగు చేసే రైతులకు మూడేళ్ల పాటు 40 శాతం రాయితీ వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా ఫారంపాండ్లు, యాంత్రీకరణ, ప్యాక్‌హౌస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం రబీలో మామిడి, టమాట పంటలకు వాతావరణ బీమా అమలు చేస్తున్నందున రైతుల నుంచి టమాట రైతులు ఎకరాకు రూ.1,600, మామిడి రైతులు ఎకరాకు రూ.1,650 ప్రకారం ప్రీమియం కట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా కొనసాగించాలని ఆదేశించారు.



హెచ్ఓలతో సమావేశమైన ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు

‘వందేభారత్’పై మళ్లీ రాళ్ల దాడి

అనంతపురం సిటీ: వందేభారత్ రైలుపై గురువారం ఉదయం మరోసారి దాడి జరిగింది. వివరాలు.. గుల్బర్గా– బెంగళూరు వందేభారత్ రైలు తాటిచెర్ల–అనంతపురం మార్గమధ్యంలో ఒక్కసారిగా దుండగులు రైలుపై రాళ్ల దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలో సీ–3 కోచ్‌కు సంబంధించిన కిటికీ అద్దాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతపురంలోని ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్, ఎస్ఐ మధుచారి, ఏఎస్ఐ ప్రతాప్‌నాయక్, వారి సిబ్బందితో పాటు జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది సంయుక్తంగా కలసి ఘటనస్థలానికి చేరుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు. వందేభారత్ రైలుకు సీసీ కెమెరాలు ఉండటంతో ఫుటేజీల కోసం సికింద్రాబాద్‌లోని ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

రాచపాలెంకు చం.స్పందన పురస్కారం

- 8న ఎన్జీఓ హోంలో కార్యక్రమం
- అదేరోజు అనంత కవిత్వం' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మక కవులు, రచయితలకిచ్చే చం.స్పందన జీవన సాఫల్య సాహిత్య పురస్కారం ఈసారి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డికి అందిస్తున్నట్లు నిర్వాహకులు చంద్రశేఖర శాస్త్రి తెలిపారు. ఈనెల 8న (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు ఎన్జీఓ హోమ్‌లో జరిగే సాహితీ సభకు జిల్లాలోని ఉద్దండ సాహితీవేత్తలంతా హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే అదేరోజు 16 మంది ఆధునిక అనంత కవుల కవిత్వ విశ్లేషణా వ్యాసాలతో కూడిన ‘అనంత కవిత్వం’ పుస్తకాన్ని రాచపాలెం ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

టీచర్ హత్య ఘటనపై ఆగ్రహం

- దోషులను కఠినంగా శిక్షించాలంటున్న టీచర్ల సంఘాలు
- ఇలాంటి ఘటనలు ఎలాంటి సందేశం ఇస్తాయంటూ మండిపాటు

అనంతపురం ఎడ్యుకేషన్: రాయచోటి ప్రాంతంలో ప్రభుత్వ టీచర్ ఇజాజ్ అహమ్మద్ హత్య ఘటనపై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దాడి కారణంగానే తన భర్త చనిపోయాడని గాయాలను చూపిస్తూ భార్య రోదిస్తున్నా కొందరు తప్పుదోవ పట్టించే ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తాయో ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అతిగారాబంతో పిల్లలపై పడిన చిన్న దెబ్బలకే చలించిపోయి ఉపాధ్యాయులతో కొట్లాటకు దిగే తల్లిదండ్రులు ఓసారి ఆలోచించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మరణానికి కారణమైన వారిని శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇలాంటి సంఘటన భవిష్యత్తులో పునరావృతం కాకుండా చట్టాలను చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరి జనరల్ రమణా రెడ్డి, లింగమయ్య, డిప్యూటీ చైర్మన్ పురుషోత్తం, నాయకులు వెంకటరత్నం, శ్రీనివాస రెడ్డి, నరసింహులు,రామాంజనేయులు, రవీంద్ర, రాయల్ వెంకటేష్,చంద్రమోహన్, రాజశేఖర్, వెంకటరమణ, హనుమంతు ఉన్నారు.



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

వేధింపులు ఎక్కువయ్యాయి

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులు, భౌతిక దాడులు పెరుగుతున్న సందర్భంగా ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి. ఉద్యోగులు ఉపాధ్యాయులపై రోజు రోజుకూ వేధింపులు, దాడులు పెరుగుతున్నాయి. విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మరణించడం అమానవీయ చర్య. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య శాఖ, రక్షణ శాఖ ఉద్యోగులపైనా ప్రజాప్రతినిధుల వేధింపులు ఎక్కువయ్యాయి.

– విజయ్‌భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రాష్ట్ర ఉద్యోగుల సంఘం

టీచర్లు భయపడే ఘటన



విద్యార్థుల దాడిలో టీచర్ ఇజాజ్ అహమ్మద్ చనిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా టీచర్లు భయపడే ఘటన. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని సమాజంలో గౌరవ స్థానానికి వెళ్లేందుకు తీర్చిదిద్దే టీచర్లు స్వేచ్ఛగా విధులు నిర్వహించే పరిస్థితి ఉండదేమో. ఉపాధ్యాయులపై హింస అనేది ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.

– ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ సీనియర్ నాయకుడు

ఉపాధ్యాయుడిని చంపడం హేయం



ప్రభుత్వ ఉపాధ్యాయుడు చనిపోయేలా విద్యార్థులు దాడి చేయడం హేయమైన చర్య. ఉపాధ్యాయులకే రక్షణ లేకుండా పోవడం చూస్తుంటే సమాజం ఎటుపోతుందో అర్థం కావడం లేదు. ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి కఠినమైన చట్టాలు రూపొందించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి.

– ఎర్రిస్వామి, ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి, రాజశేఖర్, ఎస్‌పఏ ఏపీ రాష్ట్ర కార్యదర్శి

గురువు హత్య.. ఎలాంటి సందేశం ఇస్తుంది



దైవంతో సమానమైన గురువుపై దాడి చేసి హత్య చేయడం సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తుంది. టీచరు ఇజాజ్‌పై దాడి అత్యంత బాధాకరం. విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడి మృతి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనకు కారణం తల్లితండ్రుల పెంపకం లోపమా, బాలల హక్కు అంటూ విద్యార్థులకు ఇస్తున్న స్వేచ్ఛనా, గురువులంటే విలువలేని పోకడలా? యావత్తు ఉపాధ్యాయ లోకం జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించిన ఘటన ఇది.

– ఎస్.నాగిరెడ్డి జిల్లా అధ్యక్షులు వైఎస్సార్‌టీఏ

సమాజానికి ఆందోళన కల్గించే ఘటన



ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ విద్యార్థుల దాడిలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థి దశలోనే పిల్లలు తప్పుదోవ పడుతున్నారు, ఇది సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం విచారణ జరిపించి, దోషులకు కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు సామాజిక అవగాహన శిక్షణా తరగతులు నిర్వహించాలి. పోలీసులు తరచూ పాఠశాలలను సందర్శించి, నేర స్వభావం కలిగిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేలా చూడాలి.

– బండారు శంకర్, ఎంటీఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి

న్యాయవాదుల పోరుబాట



రిలే నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

అనంతపురం: ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) కేసుల విషయంలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడంపై అనంతపురం బార్ అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసులను ప్రత్యేక కోర్టు ద్వారా తీర్పులు వెలువరించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాయలసీమ పరిధిలో కేసులన్నీ తిరుపతి ప్రత్యేక కోర్టు పరిధిలోకి తెచ్చారు. దీంతో జిల్లాలో న్యాయవాదులు భగ్గుమన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టులో కోర్టు ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, జనరల్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ రెడ్డి, గోవిందరాజులు, వెంకట్రాముడు, ఆదినారాయణ, శ్రీనివాసులు, హనుమన్న, రవి నాయక్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. బార్ కౌన్సిల్, న్యాయ నిపుణులను సంప్రదించకుండా ఏకపక్షంగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. దీంతో ఎవరికీ ఉపయోగం లేదన్నారు. వాది, ప్రతివాది, జామీన్లు వేసే అందరికీ ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. వచ్చే మంగళవారం వరకు విధులు బహిష్కరిస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుండగుల పైశాచికం

పెద్దవడుగూరు: కూటమి సర్కారు అసాంఘిక శక్తుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కార్యాలయాలపై పైశాచికం ప్రదర్శిస్తున్నారు. మండల పరిధిలోని లక్ష్మంపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన నవరత్నాల శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించారు. వెంటనే ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు తెగబడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.



శిలా ఫలకం ధ్వంసం చేసిన దృశ్యం

రెండో రోజూ రైల్వే సంఘాల ఎన్నికల పోలింగ్

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల పోలింగ్ గురువారం కూడా కొనసాగింది. డివిజన్ వ్యాప్తంగా రెండు రోజుల్లో 82.5 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 14,359 మంది ఓటర్లు ఉండగా గురువారం 4,408 మంది ఓటు హక్కు వినియోగించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో 11853 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లాలో 12 మందికి కారుణ్య నియామకాలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ అనుబంధం, జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన వారి వారసులు 12 మందికి ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు. జెడ్పీ కార్యాలయంలో గల తన చాంబర్‌లో సీఈఓ వెంకటసుబ్బయ్య, ఏ సెక్షన్ ఏఓ షబ్బీర్ నియాజ్‌తో కలసి నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, చిత్తశుద్ధితో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

పక్కా ప్రణాళికతోనే గ్రామ స్వరాజ్యం

పక్కా ప్రణాళికతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ‘స్థానికీకరణ– సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన’లో భాగంగా గురువారం స్థానిక డీపీఆర్‌సీ భవన్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభిమాన్(ఆర్‌జీఎస్‌ఏ) నిధుల వినియోగంపై శిక్షణ ఎంతో ఉపయోగకరమన్నారు. గ్రామీణాభివృద్ధి చాలా కీలక అంశమని, అయితే ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు గల అనేక అవకాశాలను అన్వేషించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులనూ సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకొని పక్కాగా అమలయ్యేలా చూడాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో చెప్పే అంశాలను శ్రద్ధగా విని కింది స్థాయి అధికారులకు అర్థమయ్యేలా చెప్పాలని సీఈఓ వెంకటసుబ్బయ్య సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన అంశంపై అందరితో ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి ప్రతిజ్ఞ చేయించారు. తొమ్మిది అంశాలపై డీఆర్‌డీపీ డీపీఎం గంగాధర్, తాడిమర్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవర్ధన్‌నాయుడు, గుత్తి సీడీపీఓ ఎ.నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనాంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఈఓపీఆర్‌డీ అశోక్ నాయక్, డీఎల్‌పీఓ సుమన జయంతి శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈఈలు పాల్గొన్నారు.



కారుణ్య నియామక ఉత్తర్వులు అందుకున్న వారితో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

కారుణ్య నియామకాలు పొందిన వారికి కేటాయించిన స్థానాలు ఇలా..

ఉద్యోగి పేరు	కేటాయించిన ప్రాంతం
ఎస్.ముజఫర్‌సుల్తాన్ నాజిరిన్	జెడ్పీ, అనంతపురం
బి.ఉమేశ్ కుమార్	జెడ్పీ, అనంతపురం
వి.నందిని	ఎంపీపీ, సోమందేపల్లి
ఎస్.బాలాజీ	ఎంపీపీ, నల్లచెరువు
టి.హేమంత్	ఎంపీపీ,బ్రహ్మసముద్రం
పి.ఉష	ఎంపీపీ, గుమ్మఘట్ట
బి.తిప్పేస్వామి	ఎంపీపీ, అమరాపురం
బి.ప్రమోద్	ఎంపీపీ, కొత్తచెరువు
బి.నిరోష వ్యాస్	ఎంపీపీ, అనంతపురం
జి.సుజాతమ్మ	జెడ్పీహెచ్ఎస్ బాలికలు, మడకశిర
జి.షెక్షా	ఎంపీపీ, కుందుర్పి
టి.శోభారాణి	ఎంపీపీ, బుక్కరాయసముద్రం

కొనసాగుతున్న మొబైల్ బందోబస్తు

తాడిపత్రి రూరల్: అనంతపురం జిల్లా తాడిపత్రి మండల సరిహద్దులోని బొందలదిన్నె వద్ద నుంచి వచ్చే వాహనాలను టీడీపీ మద్దతుదారులు అడ్డుకోకుండా పోలీసు మొబైల్ బందోబస్తు కొనసాగుతోంది. వైఎస్సార్ జిల్లా ముద్దనూరు వద్ద గల రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు చెందిన ఫ్లయాష్ రవాణా విషయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య వివాదం జరుగుతున్న విషయం విదితమే. ఈ వివాదం కారణంగా పలుమార్లు తాడిపత్రి మండల సరిహద్దు గ్రామమైన బొందలదిన్నె వద్ద వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే ఇసుక టిప్పర్లు, ఫ్లయాష్ రవాణా చేసే వాహనాలను జేసీ మద్దతుదారులు అడ్డుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తాడిపత్రి అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రి మండల సరిహద్దుకు వెళ్లే కడపరోడ్డు రహదారి వెంట మొబైల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచి భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. విద్యుత్ చార్జీల భారం ఉపసంహరించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పవర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. జాఫర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోము సరికదా తగ్గిస్తామంటూ ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు నేడు ఇందుకు విరుద్ధంగా విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. పెంచిన చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు అల్లీపీరా, రమణయ్య, వలి, సంతోష్‌కుమార్, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: భూ సమస్యలు కచ్చితంగా పరిష్కరించేలా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో భూ సర్వే చేసిన సందర్భంగా వచ్చిన సమస్యలు పరిష్కారం కావాలంటూ ఉభయ రైతులు అంగీకరిస్తూ సదస్సుల్లోనే ఆన్‌లైన్ నమోదు చేయడానికి తహసీల్దార్లకు లాగిన్ ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్‌పీఎం పెట్టిన భూముల వివరాలకు సదస్సులో పరిష్కారం చూపడం ద్వారా గ్రామాల్లో భూ సమస్యల కొంత మేర తగ్గుతాయన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో పాత రికార్డు లేదా కొత్తగా సర్వే చేసిన రికార్డు అయినా ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఏ రికార్డు ఆన్‌లైన్‌లో ఉంచకపోవడం వల్ల కబ్జాలు పెరిగిపోతున్నాయన్నారు. తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన 1బీ, అడంగల్ రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

అనంతపురం అర్బన్: బకాయిపడ్డ మూడు నెలల వేతనాలు చెల్లించాలంటూ నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న అదనపు కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. నగర పాలక సంస్థలో అదనపు కార్మికులుగా పనిచేస్తున్న 131 మందికి నెలసరి వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.12 వేల వేతనాన్ని రూ.15 వేలకు పెంచుతామని పాలకవర్గం, కమిషనర్ గతంలో ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐతో పాటు క్యాజువల్ సెలువులు మంజూరు చేయాలన్నారు. ఆప్కాస్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు రామిరెడ్డి, ప్రకాష్, తిరుమలేష్, వెంకటేశులు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్ ఫెస్ట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాలిటెక్ ఫెస్ట్–2024 గురువారం ముగిసింది. న్యాయ నిర్ణేతలుగా జేఎన్‌టీయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, కియా ప్రతినిధులు, సాంకేతిక విద్యాశాఖ అధికారి వేణుమాధవ్ వ్యవహరించారు. మొత్తం 17 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. గుంతకల్లు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 'సోలార్ పవర్డ్ సైనరెలింగ్ సిస్టమ్' అంశంపై రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి దక్కింది. రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 'ఎర్గోనమిక్ లోడ్ క్యారియింగ్ ఫర్ లేబర్ వర్క్' నమూనాకు రెండో స్థానం లభించింది.అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

అనంతపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సర్వజనం.. అసౌకర్యాల మయం

- అధ్వానంగా జీజీహెచ్‌లో అత్యవసర విభాగాలు
- పాత మంచాలు, పనిచేయని ఏసీలే దిక్కు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



ఇది సర్వజనాస్పత్రిలో గైనిక్ వార్డులోని ఐసీసీయూ. సిజేరియన్ చేసిన కేసులను ఇక్కడ ఉంచుతారు. కాగా ఈ యూనిట్‌ను చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. లోపలి వైపు సెల్ఫ్‌లను శుభ్రం చేయక ఏళ్లు గడిచినట్లు స్పష్టంగా కన్పిస్తోంది. అదేవిధంగా ఏసీలు మరమ్మతుకు నోచుకోలేదు. ఇలా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, చిన్నపిల్లల విభాగం, అక్యూట్ మెడికల్ కేర్ తదితర విభాగాల్లో దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది.



సర్వజనాస్పత్రిలోని ఐసీసీయూలో అధ్వాన స్థితికి చేరిన పడకలివి. మెడిసిన్ విభాగానికి సంబంధించిన ఈ యూనిట్‌లో పడకలు సరిగా లేకపోవడంతో పాటు ఆక్సిజన్ వ్యవస్థ సరిగా లేదు. దీంతో రోగులకు సరిగా ఆక్సిజన్ అందడం లేదు. అదేవిధంగా పల్స్ ఆక్సీమీటర్లు పని చేయడం లేదు.



అరకొర వసతుల నడుమ అవస్థలు పడుతున్న రోగులు, బంధువులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అత్యవసర విభాగాల్లో సౌకర్యాలు మృగ్యంగా మారాయి. పాత పడకలు, చెడిపోయిన ఏసీలతో ఆ వార్డులు అధ్వానంగా తయారయ్యాయి. ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద అడ్మిషన్ చేసే రోగులకందించే సేవల్లో నాణ్యత ప్రమాణాలు పడిపోయాయి. శస్త్రచికిత్సలు, వైద్యానికి సర్వజనాస్పత్రికి నిధులు వస్తాయి. ఆ డబ్బుతో వార్డుల్లో మంచి పడకలు ఏర్పాటు చేయవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

డ్రగ్ స్టోర్‌లో ఐసీయూ మంచాలు..

సర్వజనాస్పత్రిలోని డ్రగ్ స్టోర్‌లో అధునాతన ఐసీయూ కాట్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మంచాలను రోగులకు వినియోగిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. పదుల సంఖ్యలో మంచాలు, పల్స్ ఆక్సీ మీటర్లు తదితర పరికరాలున్నా ఆస్పత్రి ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతుందో లేదో వేచి చూడాలి.



ఇది ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్థో వార్డులోని ఆరోగ్య శ్రీ యూనిట్. ఆరోగ్య శ్రీ కింద శస్త్రచికిత్సలు చేసిన రోగులను ఇక్కడ అడ్మిషన్‌లో ఉంచి సేవలందిస్తారు. పాత పడకలు కావడంతో హెచ్చుతగ్గులతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇక.. రోగులకు సంబంధించిన సామగ్రిని ఉంచుకునే ఐరన్ డబ్బాలు చిలుముపట్టాయి.

సౌకర్యాలు సరిగా లేవు..

సర్వజనాస్పత్రిలో సౌకర్యాలు సరిగా లేవు. ఆరోగ్య శ్రీ వార్డులో మంచాలు అధ్వానంగా ఉన్నాయి. యువకులైతే సర్దుకుంటారు. వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వార్డుల్లో కొత్త మంచాలు వేయిస్తే బాగుంటుంది.

– రాజు, కళ్యాణదుర్గం

మంచాలు తెప్పిస్తాం

వార్డుల్లో పడకల సమస్య ఉంటే ముందస్తుగా తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 10 పడకలు ఆర్డర్ చేశాం. సూపర్ స్పెషాలిటీలో ఏమైనా పడకలుంటే వాటిని తెప్పించేలా చూస్తాం. ఏసీలు, ఇతర పరికరాలను కొరతపై ఆరా తీసి తగిన చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సీఐటీయూ నాయకులు విన్నవించారు. గురువారం కలెక్టరేట్‌కు విచ్చేసిన మంత్రిని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, గ్రానైట్ టైల్స్ అండ్ లేయింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, రాడ్ బెండర్స్ సంఘం నాయకులు సూర్యనారాయణ, రామ్మోహన్, ముత్యాలప్ప, జిలాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

అనంతపురం కల్చరల్: సుబ్రమణ్య షష్టి సందర్భంగా హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి మఠం బసవరాజస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. షష్టి వేడుకల సందర్భంగా నిర్వహించే శ్రీవారి కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకావాలన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



మహబూబ్ బాషాను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న సాక్షి ఫొటోగ్రాఫర్ మహబూబ్ బాషా భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ, ఫైట్ ఫర్ రైట్ నాయకులు ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మహబూబ్ బాషాను వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ చైర్మన్ సాకే హరి మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను ప్రాణాలకు తెగించి మహబూబ్ బాషా ఫొటోలు తీశారన్నారు. ఇందుకు ఆయనకు జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో రాజు, సుగమంచి శ్రీనివాసులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం రూరల్: కారు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తపోవనం సర్కిల్ వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక ఎంతో మంది యువత డ్రైవర్ వృత్తిని ఎంచుకుంటున్నారన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. కారు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతో పాటు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజేష్, కృష్ణుడు, చిరంజీవి తదితరులున్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు: 'భవిష్యత్‌కు యువతే మార్గమని, కానీ ప్రస్తుతం చాలా మంది యువత మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి' అని ఎస్ఐ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ప్రాణాపాయం తలెత్తి జీవితాలు నాశనం అవుతాయన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు.

ఆటోను ఢీకొన్న బైకు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రాఘవంపల్లి క్రాస్ వద్ద బుధవారం రాత్రి ముందు వెళుతున్న ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అనంతపురం నుంచి ధర్మవరం వెళుతున్న ఆటోను తాడిమర్రి మండలం పిన్నదరి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పాతిమాకు, ద్విచక్ర వాహన దారుడు అభిషేక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆటో డ్రైవర్ సులోమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్రిడ్జెస్ టన్నెల్ కోర్సు ఘనత జేఎన్‌టీయూదే



ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: దేశంలోనే బ్రిడ్జెస్ అండ్ టన్నెల్ కోర్సును ప్రవేశపెట్టిన తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ ఘనత దక్కించుకుందని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో గురువారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జ్ ఇంజినీరింగ్ (ఐఐబీఈ) స్టూడెంట్ ఛాప్టర్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంటెక్ బ్రిడ్జెస్ టన్నెల్ కోర్సు పూర్తి చేస్తే తక్షణ ఉద్యోగావకాశాలు దక్కడంతో పాటు ఆకర్షణీయమైన జీతం వస్తుందన్నారు. ఇలాంటి కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, పీజీ ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, సివిల్ విభాగాధిపతి డాక్టర్ బి. అజిత, ప్రొఫెసర్ వైశాలి గోర్పడే, ప్రొఫెసర్ అరుణకాంతి తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లోని రేషన్ షాపులో బియ్యం తక్కువ తూకం వేస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్న వైనంపై 'సాక్షి'లో బుధవారం 'తూకాల్లో మోసం ' శీర్షికన వచ్చిన కథనంపై కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు రంగంలో దిగారు. అనంతపురం రూరల్ సీఎస్‌డీటీ ఇంతియాజ్ అహ్మద్, స్థానిక వీఆర్‌ఓ విమల, ఇతర సిబ్బంది వెళ్లి గురువారం విచారణ చేపట్టారు. ఇద్దరు లబ్ధిదారులను రేషన్ షాపు వద్దకు పిలిపించారు. రెండున్నర కేజీల బియ్యం తక్కువ తూకం వేశారంటూ లబ్ధిదారులు వివరించారు. వారికి ముందురోజు ఎన్ని కేజీలు తక్కువ ఇచ్చారో....అంత తూకం ఇప్పించారు. ఇక తమకు పూర్తిస్థాయిలో కోటా అందినట్లు తమతో బలవంతంగా సంతకాలు చేయించుకున్నారంటూ సూరమ్మ, నాగలక్ష్మి వాపోయారు. చుట్టుపక్కల చాలా మంది లబ్ధిదారులున్నా ఎవరితోనూ మాట్లాడకుండా తూతూమంత్రంగా విచారణ జరిపారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాగలక్ష్మి, సూరమ్మతో పాటు వెంకటలక్ష్మి, రుక్మిణి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో ఏఓ విజయలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. తమ రేషన్‌షాపులో ప్రతినెలా రేషన్ తక్కువ తూకం వేస్తున్నారని విచారణలో భాగంగా కొందరు అధికారులు వచ్చి తమతో సంతకాలు పెట్టించుకున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులు అందరితో విచారణ జరపాలని కోరారు.



బేలోడులో రథంలో ఊరేగుతున్న స్వామి

కనులపండువగా రథోత్సవం

గుమ్మఘట్ట: బేలోడు గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్‌ను రథంలో అధిష్ఠించి గ్రామంలో పురవీధుల్లో ఊరేగించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు

చెన్నేకొత్తపల్లి: పాఠశాలలు, బడి బయట ఉన్న కౌమార దశ బాలికల ఆరోగ్యంపై వారికి అవగాహన కల్పించడంతో పాటు ముఖ్యంగా రక్తహీనతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ సభ్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ముష్టికోవెలలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు కళాధర్, సుబ్బారావు, వైద్యాధికారులు సరిత, రవినాయక్‌లు, పీహెచ్ఎన్ పద్మావతి పాల్గొన్నారు.

అర్జీలు సమర్పించండి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. భూములు, రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలను సమర్పించవచ్చన్నారు. 6న కనుముక్కల, 10న మేడాపురం, 11న పులేటిపల్లి, 12న నాగసముద్రం, 13న ముష్టికోవెల, 17న న్యామద్దెల, 18న గంగినేపల్లి, బ్రాహ్మణపల్లి, 19న వెల్దుర్తి, 20న ప్యాదిండి, 24న చెన్నేకొత్తపల్లిలో సదస్సులు జరుగుతాయన్నారు.

మంజునాథ్‌కు డాక్టరేట్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన దాసరి మంజునాథ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ జీవీ సుబ్బా రెడ్డి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ పర్యవేక్షణలో 'స్పేషియల్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ యురేనియం అండ్ అసోసియేటెడ్ వాటర్ క్వాలిటీ పారామీటర్స్ ఆన్ గ్రౌండ్ వాటర్ ఆఫ్ రాయలసీమ రీజియన్ (అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప, ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై మంజునాథ్ పరిశోధన చేశారు. పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. మంజునాథ్ స్వగ్రామం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం దుద్దేబండ.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు, గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం అధికారులు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ వడ్డుపల్లి బైపాస్ నుంచి తలుపూరుకు తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, మండల ఇంజనీర్ పార్థసారథి, ట్రాన్స్‌కో ఈఏ దాస్, ఏపీఓ సుజాత, టీడీపీ నాయకలు బాలాజీ, శశాంక్ , శీన తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఆత్మకూరు: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనాయక్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6న బి.యాలేరు, 11న తోపుదుర్తి, 12న తలుపూరు, 17న పి.యాలేరు, 19న ఆత్మకూరు, 20న మదిగుబ్బ, 26న సనప, 27న గొరిదిండ్ల గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతపురం మండలంలో..

అనంతపురం రూరల్: సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి అర్బన్ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 వతేదీల్లో అనంతపురం రూరల్ పంచాయతీ, 17, 19 వతేదీల్లో ఏ. నారాయణపురం, 21న కక్కలపల్లి పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రాప్తాడు: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ విజయకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు.

న్యాయం చేయాలని వినతి



ఏపీకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఈద్గా మసీదు కాంప్లెక్సులో అద్దెకుంటున్న వారికి న్యాయం చేయాలని ఇన్సాఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఎస్.పి. ఖాజాహుస్సేన్ అన్నారు. గురువారం ఇన్సాఫ్ ప్రతినిధులు రెవెన్యూ పాలనాధికారిణి విజయలక్ష్మికి వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు తాము అడ్డు కాదన్నారు. అయితే మసీదులో కొంత భాగం మాత్రమే తొలగించాలన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసినా వారు ముస్లిం ప్రజా సంఘాల వారితో మాట్లాడకుండా కేవలం ఒకరిద్దరి అభిప్రాయాలు చాలన్నట్లు వెళ్లిపోయారన్నారు. ఇలా అయితే ఎంతో మంది తీవ్రంగా నష్టపోతారన్నారు. అందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దెకుంటున్న వారితో పాటు రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ ప్రతినిధులు అల్లిపీర, చాంద్ బాషా, రహంతుల్లా, హాజీవలి తదితరులున్నారు.

వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెల్దుర్తి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి చెందిన నరేంద్రకుమార్ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెల్దుర్తి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని స్కార్పియో ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన నరేంద్రకుమార్‌ను స్థానికులు ప్రైవేటు వాహనంలో కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.